# కాలనీల అభివృద్ధికి కృషి

**క్యాలెండర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

అమీర్‌పేట్, జనవరి 18 : ఎస్‌ఆర్‌నగర్ కాలనీవాసుల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తన నివాసంలో ఆవిష్కరించారు. ఉపయోగకరమైన సమాచారంతో కూడిన క్యాలెండర్‌ను అందుబాటులోకి తెచ్చిన కాలనీ ప్రతినిధులను అభినందించారు. కాలనీలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, కాలనీల అభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డేవిడ్, వివేకానంద్, రోజారెడ్డి, బీఆర్‌ఎస్ అమీర్‌పేట్ ప్రధాన కార్యదర్శి సంతోష్, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

## ఆకట్టుకున్న వింగ్స్ ఇండియా-24 ప్రదర్శన

**• పాల్గొన్న ఎమ్మెల్యే లాస్యనందిత**



బేగంపేట్ విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా- 2024 ఏవియేషన్ షోను గురువారం కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత, ఏవియేషన్ నిపుణులు, బీఆర్‌ఎస్ నేతలు నివేదిత, తదితరులు పాల్గొన్నారు.

– కంటోన్మెంట్, జనవరి 18

## రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలి

**• బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు**

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 18: రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతుబంధు నిధులను తక్షణమే విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులంతా రైతుబంధు ఎప్పుడు విడుదలవుతుందోనని ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి యాభై రోజులు గడుస్తున్నా రైతుబంధు నిధులు మాత్రం మంజూరు చేయడం లేదని మండిపడ్డారు. పథకాల పేర్లు మార్చడం కాకుండా వాటిని అమలు చేస్తేనే ప్రజలు గుర్తిస్తారని పేర్కొన్నారు. పథకాల ప్రయోజనం పెంపు సంగతి అటుంచితే, కనీసం ఉన్న వాటినైనా కొనసాగించాలని హితవు పలికారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేసి వందల మంది ఆత్మ త్యాగాలకు కారణమైన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం రైతుబంధు నిధుల విడుదలలోనూ జాప్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. రైతుబంధు నిధుల విడుదలపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామగ్రామాన నిరసన ప్రదర్శనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



డివిజన్‌లో పెండింగ్ పనులను పరిశీలిస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, జనవరి 18 : మెట్టుగూడ డివిజన్‌లో దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. గురువారం డివిజన్‌లోని హనుమాన్ టెంపుల్, సాయి నికేతన్ స్కూల్ తదితర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## 60 ఫీట్ల రోడ్డుపై చెత్త డంపింగ్

**• ఇబ్బందులు పడుతున్న బీకేగూడ వాసులు, వాహనదారులు**



బీకేగూడ 60 ఫీట్ల రోడ్డులో జీహెచ్‌ఎంసీ సిబ్బంది వేసిన చెత్తకుప్ప

అమీర్‌పేట్, జనవరి 18 : బీకేగూడ 60 ఫీట్ల రోడ్డుపై జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. స్థానిక క్రీసెంట్ కాన్వెంట్ స్కూల్ సమీపంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది చుట్టుపక్కల కాలనీల నుంచి సేకరించిన చెత్తను పెద్ద వాహనాల్లో తరలించేందుకు వీలుగా తాత్కాలికంగా డంప్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ పోగవుతున్న చెత్తతో చుట్టుపక్కల వారికే కాకుండా వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నది. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆ ఒక్క రోజే చెత్త తీసివేయించి, మరుసటి రోజు నుంచి చెత్త వేయడం పరిపాటిగా మారింది. చెత్త డంపింగ్‌ను ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నారు.

## టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్‌కు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 18: తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా అసోసియేషన్ ఓయూ శాఖ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ బీబీఏ, బీసీఏ, బీబీఎం కోర్సుల అనుమతులు, ఇతర అంశాలను ఏఐసీటీఈ టేకోవర్ చేయడం సరికాదన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదలయ్యేలా చూడాలని కోరారు.



టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## రోగుల సహాయకులకు అన్నదానం



అమీర్‌పేట్‌కు చెందిన విజయసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ విజయదుర్గ పాల్గొని సుమారు 500 మందికిపైగా రోగుల సహాయకులకు అన్నదానం చేశారు.

– అమీర్‌పేట్, జనవరి 18

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**• బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్**



ఎయిర్‌లైన్స్ గేట్ ప్రాంతంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

కంటోన్మెంట్, జనవరి 18 : రెండో వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రెండో వార్డు రసూల్‌పురాలోని ఫయూమ్ జోపిడి, ఎయిర్‌లైన్స్ గేట్ ప్రాంతాల్లో టీఎన్ శ్రీనివాస్ పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అందించినట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందితను భారీ మెజార్టీతో గెలిపించడంపై ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఫయూమ్ భాయ్, రాము, సంతోష్, మహేశ్వరి, అరుణ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ‘అభయహస్తం’ లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి శ్రీనివాస్


అడ్డగుట్ట, జనవరి 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం పథకంలో లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం అడ్డగుట్టలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పడం ఆపి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఏలాంటి పైరవీలకు తావులేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు యాదగిరి, రషీద్, ఖదీర్, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

అంబర్‌పేట/ కాచిగూడ,జనవరి 18 : అంబర్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడలోని బండాల్‌బస్తీ, నింబోలిఅడ్డా ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బస్తీ, కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలు, కుక్కల బెడదను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా స్పందించిన కాలేరు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గాల కంటే కాచిగూడను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థను త్వరిగతిన ఆధునీకరిస్తామన్నారు.

## ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా దళిత జర్నలిస్టును నియమించండి

**• డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు దళిత జర్నలిస్ట్ ఫోరం వినతి**



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దళిత జర్నలిస్ట్ ఫోరం ప్రతినిధులు

అడ్డగుట్ట, జనవరి 18 : తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా దళిత జర్నలిస్టుకు అవకాశం కల్పించాలని దళిత జర్నలిస్ట్ ఫోరం ప్రతినిధులు గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే వివేక్‌లను కలిసి కోరారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా దళితుడిని నియమిస్తే తమకు సముచిత గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. వచ్చే నెలలో రవీంద్రభారతిలో దళిత జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల చైర్మన్లు, ముఖ్య ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం ఉంటుందని, కార్యక్రమానికి హాజరుకావాలని డిప్యూటీ సీఎంను కోరారు. దళిత జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు కాశపోగు జాను, ప్రధాన కార్యదర్శి డేవిడ్, ఉపాధ్యక్షులు బండారు రాజు, ప్రకాశ్, రత్నకుమార్, ప్రతినిధులు యాదగిరి, దొమ్మాటి శివకుమార్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## • ప్రధాని పిలుపు మేరకు ఆలయాల శుభ్రత



ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయాన్ని శుభ్రపరుస్తున్న సికింద్రాబాద్ బీజేపీ నాయకులు

సికింద్రాబాద్, జనవరి 18: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం సికింద్రాబాద్, సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని పలు ఆలయాలను సికింద్రాబాద్ బీజేపీ నాయకులు శుభ్రపరిచారు. అయోధ్య రామ మందిరంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా పలు ఆలయాలు, గోపురాలను శుద్ధి చేసినట్లు రాచమల్ల కృష్ణమూర్తి తెలిపారు. మేడిబావి పోచమ్మ,ముత్యాలమ్మ ఆలయాన్ని పలువురు నాయకులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో అంబాల రాజు, ప్రసాద్, అరవింద్, హరి, పాల్గొన్నారు.

**బ్రాహ్మణ బస్తీలో...**

సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణ బస్తీ ఆరుట్ల మైసమ్మ ఆలయంలో సికింద్రాబాద్ భజరంగ్ సేన నాయకులు సతీష్‌రాజ్, అజయ్‌నాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం చేపట్టారు. భజరంగ్ సేన మహంకాళి జిల్లా నాయకులు స్రవంతి, జగదీశ్‌గౌడ్, రవీంద్ర, సాగర్, మల్లికార్జున్, మధుసూదన్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణబస్తీ ఆరుట్ల మైసమ్మ ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సికింద్రాబాద్ భజరంగ్ సేన నాయకులు

# ఎన్టీఆర్‌కు ఘన నివాళి

సికింద్రాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం సికింద్రాబాద్‌లో టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. నామాలగుండు చౌరస్తాలో నాయకులు జీవీ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వారాసిగూడ చౌరస్తాలో టీడీపీ నాయకుడు గరిగె ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాలా బంధు శ్రీనివాస్, వెంకటస్వామి, వినోద్‌కుమార్, సుధాకర్, ప్రవీణ్‌ముదిరాజ్, రాజు, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**ఉస్మానియా యూనివర్సిటీలో..**

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 28వ వర్ధంతిని గురువారం ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గణేశ్, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి పాల్గొని మాట్లాడారు. ఎన్టీఆర్ గొప్ప పాలనాదక్షుడని, నూతన సంస్కరణలకు ఆద్యుడిగా నిలిచారని కొనియాడారు. పార్టీని స్థాపించిన ఎనిమిది నెలల్లో అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుం దన్నారు. తెలుగు వారి గుండెల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. విద్యార్థి నాయకులు వెంకటస్వామి, పీవీ విజయ్‌కుమార్, చంద్రమోహన్, మురళీకృష్ణ, గోపి పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు



నామాలగుండు చౌరస్తాలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

వారాసిగూడ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



# ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

**• పీహెచ్‌సీ భవనాల నిర్మాణ పనులపై ఆరా**
**• యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయండి**
**• అధికారులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశం**

మల్కాజిగిరి, జనవరి 18: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో అల్వాల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాల నిర్మాణ పనుల గురించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. అల్వాల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రణాళికతో శిథిలావస్థకు చేరిన దవాఖానల స్థానంలో కొత్త వాటిని నిర్మించడానికి రూ.1.56 కోట్ల నిధులను విడుదల చేసిందని అన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు మంజూరు కావడంతో 2023 ఏప్రిల్ 5న దవాఖాన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు. గత ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలతోపాటు.. ఆ తర్వాత మరి కొన్ని భవనాలను నిర్మించారని అన్నారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు ప్రైవేటు దవాఖానలకు దీటుగా ఇక్కడ అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి అవసరమైన నిర్మాణాలను చేపట్టిందని అన్నారు. ప్రస్తుతం ఇక్కడి పీహెచ్‌సీ వైద్య సేవలను వెంకటాపురంలోని కమ్యూనిటీ హాల్‌లో అందిస్తున్నామని అన్నారు. భవనాలు వేగవంతంగా పూర్తి చేయాడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా అధికారులు పరిశీలించాలని అన్నారు. నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామని అన్నారు.. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాల్, ఏఈ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో అధికారులతో భవనాల నిర్మాణాలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

## రైలులో అనారోగ్యంతో వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జనవరి 18: సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఓ వ్యక్తి రైలులో అనారోగ్యంతో మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్ రాష్ర్టానికి చెందిన ఉత్తమ్ లోహర్(45) గురువారం ఉదయం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలులో జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రయాణికుల ద్వారా సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడి జేబులో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

మల్కాజిగిరి/ఉప్పల్/శామీర్‌పేట, జనవరి18 : జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల మేడ్చల్ బాలుర-1 పాఠశాల, నాచా రం చౌరస్తాలోని ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణసౌజన్య కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25వ విద్యా సంవత్సరానికి 5వ తరగతితో పాటు ఇంటర్ మీడియట్ మొద టి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులకు మైనార్టీ, నాన్‌మైనార్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అదే విధంగా 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు పాఠశాలతో పాటు www.tmreistelangana.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు 7995057969, 9652706230, 7331170806లకు సంప్రదించాలని కోరారు. అదే విధంగా మౌలాలిలోని సనత్‌నగర్ బాలికలు-1లో 5వ తరగతి, ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ) ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు జనవరి 18 నుంచి ఫిబ్రవరి 6వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. వివరాలకు 7995057909, 8099172796లో సంప్రదించాలన్నారు.

## పైపులైన్‌కు మరమ్మతులు

అంబర్‌పేట, జనవరి 18 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సాయిమధురానగర్ కోదండరామ నిలయం దగ్గర 15 రోజుల నుంచి తాగునీరు రావడం లేదని స్థానికులు కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.